# చలితానిలం జ్వలితానలం

రామవరపు వేణుగోపాలరావు

అరగంట నుంచీ నా చేతిలో ఉన్న ఆ ఎర్రని కాగితాన్ని చూస్తున్నాను. ఎర్రని కాగితం. దానిమీద నల్లని అక్షరాలు. కాగితం తేలికైనదే. కాని, అది మోసుకువచ్చిన సందేశం మేరువంత బరువైనది. ఎర్రని కాగితం మీద అంటించబడ్డ ఆ నల్లని అక్షరాలు వెలిబుచ్చిన భావాన్ని కొన్ని వేల సార్లు మననం చేసుకుని ఉంటాను. అది చెప్పిన కఠోర సత్యం నా గుండెల్ని ఇంకా మంచులా చల్లగా తాకుతూనే ఉంది. అగ్నిలా వేదనని ప్రజ్వరిల్ల జేస్తూనే ఉంది. ఉండి ఉండి వీచే చలితానిలం ఆ ఎర్రని కాగితాన్ని రెపరెప లాడిస్తూంది. ఆ కాగితం కదిలినప్పుడల్లా నా మనసులోని మంటల్ని—ఆ జ్వలితానలాన్ని—ఇంకా ఉధృతం చేస్తూంది.

కనుచూపు ఆనినంత మేరా ఉన్న పచ్చని పంటపొలాల్ని కళ్ళారా చూస్తూ అవి దావాగ్ని సెగలనీ, బడబాగ్ని భగభగలనీ ఎలా అనుకోవడం? కళకళ మెరిసే వెండి గిన్నెలో అప్పుడే పితికిన వెచ్చని పాల పొంగుల్ని చూస్తూ అవి కాలనాగిని కరాళదంష్ట్రల ధవళకాంతులని ఎలా భావించడం?

నా చేతుల్లో ఇంకా రెపరెపలాడుతూ ఉన్న ఆ ఎర్రని కాగితం, కాగితంలా నాకు అనిపించడం లేదు. అదొక అరుణ రేఖ. అగ్ని చాచిన నాలుక. కావలసిన మనిషి హృదయాన్ని దహించే దావానలం. అది మోసుకొచ్చిన క్రూరవార్త నాకు సంబంధించినది కాదు. అయినా, అది నా గుండెనీ, దేహంలోని ప్రత్యణువునీ రంపపుకోత కోస్తూంది.

● ● ●

ఏడాది క్రితం విశాఖపట్నంలో ఉండే వాడిని. హఠాత్తుగా హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ చేశారు. నా కేం పెళ్ళామా, పిల్లలా? ఒంటిమర్కటం గాడిని. పెట్టే బేడా సర్దుకుని, అంతకుముందే ఓ స్నేహితుడి ద్వారా సంపాదించిన అద్దె ఇంట్లో గృహప్రవేశం చేశాను. ఆ ఇంట్లో చేరిన అరగంటకే నే నున్న ప్రదేశం ఓ చిన్నసైజు అడవి అని గ్రహించాను. దాన్ని బహదూర్‌గూడా అంటారుట. అక్కడ గంట కోసారి వచ్చే బస్సు ఎక్కితే, ఎక్కిన అర గంటకి కోఠీ చేరతాం. అక్కడ ఇంకో బస్సు ఎక్కితే మరో ముప్పావు గంటకి నేను పనిచేసే ఫాక్టరీ వస్తుంది. మొదట్లో ఈ బస్సు ప్రయాణం చిరాకనిపించినా, క్రమేపీ అలవాటు పడిపోయాను.

మొదట అడవి అనిపించిన వాతావరణం నందనవనంలా ఉందిప్పుడు. ఎలాగూ కొన్నాళ్ళలో సీనియర్ ప్రాసెస్ ఆపరేటర్‌గా ప్రమోషన్ రావడం ఖాయం. కొన్నాళ్ళకి స్కూటర్ ఏదేనా కొనుక్కోవచ్చు. అప్పుడింత ఇబ్బంది ఉండదు. చుట్టుపక్కల అంతా ఏవేవో ఆఫీసుల్లో పనిచేసే వాళ్ళే. ఉదయం పోయి సాయంత్రం వస్తారు. నాకు షిఫ్టు డ్యూటీలు. ఎవరితోనూ పరిచయం లేదు. అంతా ఏకాంతం. ఇంటిముందున్న ఖాళీస్థలాన్ని మడిలా చేశాను. రకరకాల విత్తనాలు నాటాను. కొన్నాళ్ళకల్లా మొలిచిన మొక్కలు ఎదిగి పూచాయి. రకరకాల పువ్వులు. బంతులు, చేమంతులు, గులాబీలు. వరండాలో కుర్చీ వేసుకుని ఆ రంగురంగుల పూలని చూస్తూ, ఏ ఊహాసుందరి కోమల హస్తాల్లోనో పులకించిపోవడం కన్నా ఇంకేం కావాలి? అనిపించేది నాకు.

ఓ రోజు సెకండ్ నైట్ డ్యూటీ చేసి సాయంకాలం వరకూ నిద్రపోయాను. అప్పుడే లేచి స్నానం చేసి వరండాలోకి వచ్చాను. అలవాటు ప్రకారం నా చిన్ని ఆరామంలోని రంగురంగుల పూలకేసి చూశాను. అంతలో నా దృష్టిని ఓ చిన్న పాపాయి ఆకర్షించింది. గేటు అవతల నిలబడి కటకటాల్లోంచి చిన్న కళ్ళతో ఆరాధనగా పూలకేసి చూస్తూంది. ఆ పాపకి మూడేళ్ళు ఉంటాయేమో? తెల్లగా బొద్దుగా ఉంది. ఎర్రని పువ్వులున్న నీలం రంగు ఫ్రాక్ తొడుక్కుని ఉంది. చేతులకి చెరో ఎంగారు గాజు. చెవులకి పెద్ద పెద్ద రింగులు పోనీటెయిల్. కాటుక కళ్ళు. నుదుటి మీద ఎర్రగా మెరిసే తిలకం. పువ్వుల్లో రోజాలా, తారల్లో ధ్రువతారలా, పాలలో వెన్నలా, సముద్రం మీద వెన్నెల్లా అమాయకంగా మిలమిల మెరుస్తూ అక్కడ నిలబడింది.

''ఏం బేబీ, ఏం కావాలి?'' అన్నాను. నా ప్రశ్న నాకే అసహజంగా తోచింది. నా ప్రశ్నతో ఆ అమాయక నయనాల్లో కల్లోలం కలిగించినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

చుట్టూ సాయంసంధ్య లేత ఎరుపు పొడిని భూమిమీద జల్లుతూంది.

నా ప్రశ్న విని నా వేపు చూసి తియ్యగా నవ్వింది ఆ పాప. ముత్యాల్లాంటి పలువరస ఒక్కసారి తళుక్కుమంది. తీరాలు కనబడని దూరపు సరోవరంలో మీనాల పరుగులు, ఆకుపచ్చని అడవుల్లోని వృక్షాగ్రాలమీద గాలి చేసే గుసగుసలు, మేఘాల మేలిముసుగుల్లోని తారకల దరహాసాల ధ్వనులు, నిశ్శబ్ద నిశీధిలో అప్పుడే నడక నేర్చిన జింకపిల్ల బుడిబుడి నడకల చప్పుళ్ళు—ఒక్కసారి నా చుట్టుముట్టినట్టు అయింది. నెమ్మదిగా నడిచి ఎర్రగులాబీ అంటు ముందు నిలబడ్డాను. ఓ పువ్వు కోసి ఆ పాపకి అందించాను. నెలవంక విరిసిన వెన్నెల కొస ... పాపాయిని అందుకొనే కన్యలా సంభ్రమంగా చేతులు చాచింది. చేతుల్లోని గులాబీని సగర్వంగా చూసి నా కేసి తల ఎత్తింది. కళ్ళతోనే నవ్వింది. ఆ నవ్వులో మల్లెపూల పరిమళం. ''పేరేమిటి, పాపా?'' అన్నాను, రహస్యం అడుగుతున్నంత మెల్లిగా.

''నీ పేరేమిటి?'' అంది ఆ పాప చక్రాల్లా కళ్ళు తిప్పుతూ.

''ఏయ్, బేబీ, తప్పు కదూ?'' అన్న గొంతు వినిపించింది. తల ఎత్తి చూశాను. నా ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. ఎదురుగా నా కొలీగ్ రాజు నిలబడి ఉన్నాడు.

''హల్లో రాజూ, మీరా?'' అన్నాను ఉత్సాహంగా.



"ఆఁ. అదే మా ఇల్లు" అన్నాడు, ఎదురింటిని చూపిస్తూ.

మా మాటల సందర్భంలో మెల్లిగా రాజు చంకలోకి ఎక్కింది పాప. చిన్ని వేళ్ళతో పువ్వుని పట్టుకుని నా వేపు నవ్వుతూ చూస్తూంది.

"ఇక్కడికి వచ్చి ఎన్నాళ్ళయింది?" అనడిగాను.

"నిన్ననే ఇల్లు మారాం."

"ఈ పాప ఎవరూ?"

"మా అమ్మాయే."

"నీ పేరేమిటి, పాపా?" అన్నాను మళ్ళీ.

"నీ పేరేమిటి?" అంది తకీమని. అనేసి యథాప్రకారం మోహనంగా నవ్వుతూంది. 'అమ్మ దొంగా, ముందు నీ పేరు చెప్పు. . . తరవాతే నా పేరు చెపుతా' అన్నట్టు ముఖం మీద ఆ మిస్చివస్ నవ్వు.

"తప్పుకదూ, బేబీ? ఏదీ, అంకుల్‌కి నీ పేరు చెప్పమ్మా, చెప్పాలి మరి!"

"నాకు లోజా పువ్వులిత్తే. . ." పేరు చెప్పడానికి తన కండిషన్ వెల్లడించింది.

"ఓ ఎస్. అలాగే!" అన్నాను.

"నా పేలు తలోజ" అంది.

"ఓహో. . . సరోజా?" అన్నాను.

"నీ పేలో?" అంది చిన్ని కనుబొమలు ముడి వేస్తూ పెద్ద ఆరిందాలా.

"నా పేలు లామాలావు" అన్నానో ఒక్కసారి కిలకిల నవ్వింది పాప. నేనూ నవ్వాను. "భడవా!" అంటూ రాజూ నవ్వాడు. "వెళతానండీ, మా ఇంటి కోసారి రండి. ఇప్పుడు రారాదూ?" అన్నాడు రాజు నన్ను ఆహ్వానిస్తూ.

"డ్యూటీ ఉంది. మరోసారి" అన్నాను.

"ఓకే" అంటూ తన ఇంటివేపు నడిచాడు రాజు. పాప చెయ్యి ఊపుతూ టాటా చెప్పింది. అలా అయింది నాకు బేబీ రోజాతో పరిచయం.

• • •

ఆ ఎర్రని టెలిగ్రామ్ కాగితాన్ని చూస్తూ ఉంటే మాటిమాటికీ రోజా గుర్తుకి రాసాగింది. ఆ స్వచ్ఛమైన నవ్వు, మాలిన్యం లేని మనస్సు, చిట్టి పొట్టి అడుగుల నడక...ఎలా మరిచి పోగలను? వాచీకేసి చూశాను. అయిదైంది. ఎదురింటి వేపు చూశాను. తాళం వేసి ఉంది. 'సికిందరాబాదులో ఫస్ట్ షో సినిమా ఏదేనా చూసి ఆ తరవాత సెకండ్ నైట్‌డ్యూటీకి వెళతాను' అని రాజు ఈ వేళ మధ్యాహ్నం అన్న మాటలు నాకు జ్ఞాపకానికి వచ్చాయి. ఎలాగైనా రాజుని పట్టుకోవాలి. వెంటనే కలుసుకొని అతనికి ఈ వార్త చెప్పాలి. ఎలా? అతను ఎక్కడుంటాడని ఊహించడం? అన్నట్టు ఈ వేళ షోలు ఉన్నాయో,



లేపో? పైగా ఈవేళ బంద్ ఒకటి ఏడిచింది. రాష్ట్రం అంతా ఆందోళన. అలజడి. నగరం చలనం లేకుండా శ్మశానంలా ఉంది. ముఖ్యంగా బయటికి వెళ్ళడం ఎలా? టెలిగ్రామ్ మోసుకు వచ్చిన ఆ హృదయవిదారకమైన వార్తని తొందరగా రాజుకి చెప్పితీరాలి!

గబగబ బట్టలు మార్చుకొని ఇంటికి తాళం వేసి బయలుదేరాను. బస్‌స్టాప్ చేరేసరికి అసలు సంగతి తెలిసింది. ఈ రోజు బస్సుల్లేవు. ఏదైనా టాక్సీగాని, ఆటోగాని వస్తుందేమోనని పావుగంట సేపు చూశాను. ఇక లాభం లేదని గ్రహించి నడక ప్రారంభించాను. కాలనీలో మోటార్ వెహికల్స్ ఉన్నవాళ్ళు ఇద్దరు ముగ్గురున్నారు. కాని, వాళ్ళెవ్వరూ నాకు తెలియదు. రాజు కుటుంబంతో తప్ప ఇంకెవరితోనూ పరిచయం లేదు. అంబర్‌పేట దరిదాపుల్లోకి వచ్చేసరికి విజయవాడ నుంచి వస్తూన్న టాక్సీ ఒకటి కనిపించింది. ఆపి, పది నిమిషాలపాటు ప్రాధేయపడితే నన్ను నారాయణగూడాలో డ్రాప్ చెయ్యడానికి డ్రైవర్ ఒప్పుకున్నాడు.

నాకూ, రాజుకీ హైదరాబాదులో కొన్ని ఫావరిట్ స్పాట్స్ ఉన్నాయి. అనుకోకుండా ఇద్దరికీ ఒకేసారి డ్యూటీ ఆఫ్ దొరికితే నారాయణగూడా సెంటర్లో ఏ కేఫ్‌లోనో, లేకపోతే పక్కనే ఉన్న బార్‌లోనో ఓ గంటసేపు గడుపుతాం. లేకపోతే ట్యాంక్‌బండ్ వరకూ రిక్షాలో వెళ్ళి అక్కడ కాస్సేపు గడిపి, అదే రిక్షా మళ్ళీ ఎక్కి కోఠీ చేరుకుంటాం. రిక్షాలో పోతూ అటూ ఇటూ ఉన్న షాపుల్నీ, రంగు రంగుల దీపాల్నీ, మహోన్నత్యాలలో పరవళ్ళు తొక్కే జనసమూహాన్నీ చూస్తూ, ఏవేవో గుర్తుకి తెచ్చుకుంటాం.

చిన్న కుదుపుతో టాక్సీ ఆగింది. దీపక్ సినిమాని చూడగానే దిగాను. డ్రైవర్ చేతిలో అయిదు రూపాయల నోటు పెట్టి కెఫేలోకి నడిచాను. ఒక టీ తాగి బిల్లిచ్చాక కౌంటర్‌మీదున్న టెలిఫోన్‌ని చూశాను. ఫాక్టరీకి ఫోన్ చేస్తే? గబగబ డయల్ చేశాను. "రాజు ఇంకా డ్యూటీకి రాలేదు. పన్నెండు గంటలకి వస్తాడు" అని టైమ్‌కీపర్ సమాధానం ఇచ్చాడు. వాచీ చూసుకున్నాను. ఆరు అయింది. పన్నెండు వరకూ ఎలా ఆగేట్టు? ఇంకా ఆరు గంటల కాలం గడపాలి. ఆరు గంటలంటే మూడు వందల అరవై నిమిషాలు. ఎలా? ఏం చెయ్యడం? టెలిఫోన్ కాల్‌కి డబ్బిచ్చి హోటల్ అరుగుమీద నిలబడ్డాను. సాయంకాలం ఆరు గంటలకి సంతలా, గోలగోలలా ఉండే నారాయణగూడా సెంటర్ నిర్జనంగా, బోసిగా వెలవెలబోతూ ఉంది. దీపాలుకూడా లేవు.

చీకటి. ఎటు చూసినా చీకటే.

మస్తిష్కం మీద వేలకొద్దీ సుత్తులతో ఎవరో విధి విరామం లేకుండా బాదుతున్నట్టు వేదన. ఏదో చెయ్యాలి. ఏం చెయ్యాలో తెలియని అయోమయం! నేనున్న స్థలానికి అటు రెండు ఫర్లాంగుల మేరా, ఇటు రెండు ఫర్లాంగుల మేరా షాపులన్నీ మూసి ఉన్నాయి. ఇరానీ టీ హోటలూ, బార్ తప్ప మరేవీ లేవు. అయిదేసి నిమిషాలకో సారి జర్రున చప్పుడు చేస్తూ రోడ్డుమీద పోలీసు జీపులు పోతున్నాయి. పోనీ, సనత్‌నగర్ వెళ్ళి ఫాక్టరీ నే రాజుని కలిసి ఈ విషయం చెపితే? ఎలా వెళ్ళడం?

బస్సుల్లేవు. టాక్సీల్లేవు. ఆటోలు లేవు. రిక్షాలూ లేవు. అంత దూరం ఎలా వెళ్ళడం? వెళ్ళక, ఈ పాపపుమూటను నెత్తిమీద మోస్తూ ఒంటరిగా, దైన్యంగా ఎలా గడపడం? ఇంకా ఆరు గంటలు.

కాళ్ళు యాంత్రికంగా బార్ వేపు కదిలాయి. లోపల జనం. గోల. ఉక్క. కొవ్వొత్తుల వెలుగు. సీసాల చప్పుళ్ళు. గ్లాసుల గలగలలు. ప్లేట్ల బరబరలు. పొగ. హడావుడిగా పరుగులు పెట్టే బేరర్లు, క్లీనర్లు. మెట్లనెక్కుతూ మేడ ఎక్కాను. సోఫాలో కూలబడి ఒళ్ళు విరుచుకున్నాను. బేరర్ రాగానే బీర్, చిప్స్ ఆర్డరిచ్చి సిగరెట్ వెలిగించుకున్నాను.

మరో మూడు నిమిషాల కల్లా తెమ్మన్న సరుకు వచ్చేసింది. నెమ్మదిగా సిప్ చేస్తూ చుట్టూ చూశాను. ఎవరి గొడవలో వాళ్ళున్నారు. రాష్ట్రం అంతటా అల్లర్లు. అల్లకల్లోలం. ప్రత్యక్షంగా, పక్కనే నగరంలో కాల్పులు. చావులు. లాఠీ ఛార్జీలు. ఇక్కడమాత్రం జనం నిర్లిప్తంగా సీసాల్లోది గ్లాసుల్లోకీ, గ్లాసుల్లోది కడుపుల్లోకీ వంపుకున్నారు. నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెప్పుకొంటున్నారు.

* * *

ఒక రోజు నేనేదో పుస్తకం చదువుకుంటూ ఉంటే రోజా వచ్చింది. ఎత్తుకుని ఒళ్ళో కూర్చో పెట్టుకున్నాను. నన్ను సీరియస్‌గా చూసి, "బువ్వ తిన్నావా, అంకుల్?" అంది. "ఓ" అన్నాను.

"ఏం కూర తేతేస్నా?"


జీవితంలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే అనేక మధుర క్షణాలుంటాయి



తలనొప్పి మూలంగా మీ ఆనందాన్ని పాడుచేసుకోవద్దు

2 ఆస్ప్రో తీసుకోండి

మైక్రోఫైన్డ్ ఆస్ప్రో నొప్పిని అతిశీఘ్రంగా తొలగించును

ASPRO
Nicholas

A.G.63.TL

"బంగాళాదుంపల వేపుడు చేశాను."

"అంకుల్! తక్కాగా పెళ్లి చేసుకో. అప్పుడేమో అంటే నీకు బువ్వ తేత్తుంది" అంది తమాషాగా నవ్వుతూ, 'ఏం?' అన్నట్టు చూస్తూ.

"దొంగా! ఎవరు చెప్పేరు నీకీ మాటలన్నీ? ఆఁ?" అన్నాను రోజా బుగ్గ పట్టుకుని ఊపుతూ.

పాప మొహంలో నవ్వు మాయమైంది. ఏదో గంభీరత వచ్చేసింది. నా ప్రశ్నకి జవాబు రాలేదు. "చెప్పూ. . . ఎవరు నేర్పారు నీకీ మాటలన్నీ?" అని రెట్టించాను. అంత చిన్ని పాప ముఖంలో గంభీరత ఎంత ముద్దొచ్చేలా ఉందని! "పెళ్లి ఎప్పుడు చేసుకుంటావు, అంకుల్?" అంది మళ్ళీ. "చెప్పనా?" అన్నాను. "ఊఁ" అంది ముద్దుగా. అంటూ నా రెండు బుగ్గల మీదా తన బుల్లి అరిచేతులతో నిమిరింది.

"ఏం చెయ్యను, రోజా? నన్ను ఏ ఆడపిల్లా పెళ్ళి చేసుకోవడానికి ముందుకి రావడం లేదు. నేనంటే ఎవరికీ అభిమానం లేదు. నన్ను చూస్తే భయం. నేను బూచాడిలా ఉంటానుట" అన్నాను. నా మాటలు రోజాకి అర్థమై ఉంటాయి. కాని, ఏమని అనాలో మాటల కోసం ఆలోచిస్తూంది. దానిని చూస్తూంటే సరదాగా తమాషా చెయ్యాలనిపించింది. ముఖం విచారంగా పెట్టాను. నుదురు తుడుచుకున్నాను. ముక్కు ఎగపీల్చాను. రోజా కళ్ళనిండా భయంతో రెప్పవెయ్యకుండా చూస్తూంది నా ముఖంలోకి.

"రోజా ఈ వెధవ వంట చెయ్యడం, కూర వండడం, ఉల్లిపాయలు తరగడం, మిరపకాయల ఘాటు భరించలేక పోతున్నాను. నాకూ ఎవరినేనా పెళ్ళి చేసుకోవాలనుంది. నా దగ్గర ఎంతో డబ్బుందిగా? ఆ డబ్బుతో బంగారు గాజులూ, మెడలోకి మంచి నెక్లెసూ, ఎన్నో రంగు రంగుల చీరలూ కొనాలని నాకూ ఉంది. కాని, ఎలా? ఎవరూ నన్ను పెళ్ళి చేసుకోరు. ఏం రోజా, నేను బూచాడిలా ఉంటానా?" అన్నాను.

రోజా మాట్లాడలేదు. తలని అడ్డంగా ఊపింది.

"నేనంటే ఆడపిల్లలు భయపడతారా?" అన్నాను మళ్ళీ.

"ఉహుఁ" అంది.

"పోనీ, నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నా ఆశగా రోజా కళ్ళలోకి చూస్తూ. చిన్ని కనుబొమలు ముడిచి ఏం ఆలోచించిందో మరి! "నాకు బువ్వ చెయ్యటం రాదుగా!" అంది.

"ఫర్వాలేదు. నువ్వింకా పెద్దదానివి అవుతావుగా. . . అప్పుడు వంట చేసి నాకు బువ్వ పెడుదువు గాని. ఏం? మరి నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నాను.

"ఓ" అంది చప్పున. అని చక్కగా నవ్వింది. ఎంత వెలుగో ఆ చిన్నారి ముఖంలో! దగ్గరికి తీసుకుని మృదువుగా బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాను. ఎందుకో హఠాత్తుగా ఫక్కుమని నవ్వింది రోజా. వెయ్యి గులాబులు, కోటి మల్లెలు, శతకోటి పొగడలు విరిసినట్టు నవ్వింది. ఆ నవ్వు నా గుండె నిండా నిండి చెప్పలేని ఆనందంతో నా ఒళ్ళు ఝల్లుమంది.

* * *

సీసా ఖాళీ అయింది. మరో బీరు బాటిలూ, ప్లేటు జీడిపప్పూ తెమ్మని సిగరెట్ వెలిగించుకున్నాను. కాగితాన్ని తీశాను. ఎర్రటి కాగితం మీద నల్లని అక్షరాలు అసహ్యంగా ఉన్నాయి. కళ్ళు చిట్లించుకొని చూశాను. మధ్యాహ్నం పన్నెండు గంటలకి విశాఖపట్నంలో ఆ టెలిగ్రామ్ ఇచ్చారు. హైదరాబాదు చేరేందుకు దానికి నాలుగున్నర గంటలు పట్టింది. అయినా, అది ఇంకా చేరవలసిన మనిషికి చేరలేదు. అంతలో నా మీద నాకే కోపం వచ్చింది. అసలు ఆ సమయంలో నేనెందుకు ఉండాలి ఇంట్లో? ఉన్నా, నేనెందుకు తీసుకోవాలి దాన్ని? అప్పుడీ బాధా, తపనా ఉండేవి కావుగా? నేను కాకపోతే మరొకరు తీసుకునేవారు ఓ టెలిగ్రామ్. రాజా డ్యూటీనుంచి రాగానే ఇచ్చేవారు. ఈ భయంకర వార్తని నేను. . . నేను. . . నా చేతో రాజాకి అతని ముఖం చూస్తూ ఎలా ఇవ్వగలను? ఇచ్చి, అతని విషణ్ణవదనాన్నీ, అతని దుర్భరవేదననీ ఎలా చూడగలను? చూసి ఎలా భరించగలను?

బాటిల్ ఓపెన్ చేసి నేర్పుగా గ్లాసులోకి వంచాడు బేరర్. అతని వేపు నిర్లిప్తంగా చూసి గ్లాసు ఎత్తాను. రెండు గుక్కలు తాగి సిగరెట్ పీల్చాను. లోపల సరిగ్గా గాలి ఆడనందువల్ల పొగ పాములన్నీ మెలికలు తిరుగుతూ సాగుతూంది.

* * *

నాలుగేళ్ళ కిందట. . . అవును. అప్పుడు నే నింకా విశాఖపట్నంలోనే ఉండేవాడిని. తరుచూ మా చిన్నాన్న దగ్గరికి వెళుతూ ఉండేవాడిని. పేరుకి చిన్నాన్నయినా నా కన్నా నాలుగేళ్ళే పెద్ద. పేరు పెట్టే పిలిచేవాడిని. పెళ్ళి కాకముందు మా పిన్నికి అతను వ్రాసిన ప్రేమలేఖలకి నేనే పోస్ట్‌మన్ని! ఇద్దరూ డాక్టర్లే. మహారాణీపేటలో చిన్న క్లినిక్ తెరిచారు. ప్రాక్టీసు బాగానే ఉండేది. ఓ రోజున నేనూ, వాళ్ళిద్దరూ కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చుని బాతాఖానీ కొడుతున్నాం. అంతలో ఒక ముసలాయన లోపలికి వచ్చాడు. డాక్టర్లిద్దరికీ నమస్కారం చెప్పి నిలబడ్డాడు. "బాబూ! అమ్మాయిని రేపు అత్తారింటికి పంపు వెళుతున్నాను. ఉభయుల దయవల్లా అమ్మాయి బతికి బట్ట కట్టింది" అంటూ పైపంచెతో కళ్ళు అద్దుకున్నాడు.

"దానిదేముంది లెండి. కాని, మళ్ళీ ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోండి. మరోసారి ఆ అమ్మాయి గర్భవతి అయితే ఏం లాభం లేదు. ఎవరి చేతుల్లోనూ ఏం లేదు."

మౌనంగా ఆయన తల ఆడించాడు.

"అమ్మాయి రెండోసారి నెల తప్పితే మా అల్లుడు హంతకుడి కిందే లెఖ్ఖ! ఈ సంగతి ఆయనతో చెప్పండి" అంది పిన్ని కరుగ్గా.

"అలాగేనమ్మా!" అంటూ జేబులోంచి ఓ కవరు తీసి బల్లమీద పెట్టాడు. "పెళ్ళి వస్తాను, బాబూ! సెలవు" అని నెమ్మదిగా వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోగానే—"ఎక్కడో చూసినట్టుంది. ఎవరు, కృష్ణా, ఆయన?" అన్నాను.

"మునవాదే. పాపం, చాలా బీదవాడు. సి. టి. ఎన్. స్కూల్లో టీచరుగా పని చేసేవాడు" అంటూ హఠాత్తుగా ఆగిపోయి ఆశ్చర్యంగా నా ముఖంలోకి చూశాడు. "నువ్వప్పుడే మరిచిపోయావా?" అంటూ ఏదో ఆలోచనలో పడ్డాడు, నన్ను చూస్తూ. పిన్నికూడా అదోలా చిరునవ్వు నవ్వుతూ దయగా నా కేసి చూస్తూంది. నా కేమీ అర్థం కాలేదు. అయోమయంగా కూర్చున్నాను.

"పెళ్ళిచూపులు నంబర్ సిక్స్ గుర్తుందా?" అన్నాడు చిన్నాన్న, తన కళ్ళజోడుని తీసి రుమాలుతో తుడుస్తూ.

ఆ ప్రశ్న వినగానే నా నరాల్లో చిక్కటి చలి పాకినట్టయింది. ఆవేశంతో నాలుక పిడచగట్టుకుపోయింది.

* * *

అవును. ఆ పెళ్ళిచూపులు ఎందుకు గుర్తుండవూ? నా జన్మలో మరిచిపోగలనా? ఆ నాడు నేనూ, అమ్మా, అక్కా, నాన్నగారూ నలుగురం వెళ్ళాం. ఫలహారాలూ అవీ ఇచ్చి, తిన్నాక, ఎదురుగా దుప్పటిమీద అమ్మాయిని తీసుకొచ్చి కూర్చోపెట్టారు. అయిదు సార్లు అప్పటికే చూసి చూసి విసుగెత్తి పోయావున్నాను. ఈ సారేనా నాకు పిల్ల నచ్చితే బాగుండును అన్న భావం మా వాళ్ళందరిలోనూ ఉంది. తల ఎత్తి చూశాన్నేను. పిల్ల కళ్ళు చెదిరేంత అందంగా, ఆరోగ్యంగా ఉంది. నా అంత పొడుగు కాకపోయినా మరీపొట్టి కాదు. బి.ఎ.పాసైంది. వంట బ్రహ్మాండంగా చేస్తుందిట. ఆరువేలు కట్నం ఇస్తారుట. అమ్మాయి పేర రెండెకరాల పొలం వ్రాసి ఇస్తారుట. ఇంకేం?

అక్కడ్నించి వచ్చిన మర్నాడు మా ఇంట్లో అంతా సమావేశం అయ్యాం. ఎన్నో చర్చలు జరిగాక అందరూ 'ఓకే' అన్నారు. పిల్ల నచ్చిందనీ, లగ్నాలు పెట్టుకోమనీ వాళ్ళకి కబురు చేశారు. వారం గడిచింది. నెలయింది. రెండు నెలలు గడిచాయి. అట్నించి ఉలుకూ పలుకూ లేదు. విసుగేసి, మనిషిని పంపితే — 'సారీ. మనం సగోత్రీకులం. ఈ పెళ్ళి జరగదు. ఇచ్చిన శ్రమకి అన్యథా భావించవద్దు' అని కబురు వచ్చింది.

అసలు సంగతేమంటే, ఆ అమ్మాయికే పెళ్ళికొడుకు—అంటే నేను—నేనే నచ్చలేదు. ఎందుకు? ఈ ప్రశ్నకి సమాధానం దొరకలేదు నాకు. నాలో ఏం లోపం ఉంది? ఇది జరిగిన రెండు నెలల వరకూ ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం, ఎవరో శాపం పెట్టినట్టు గంభీరతా ఏర్పడ్డాయి. ఇంట్లో నా పెళ్ళి విషయం ఎత్తాలంటే భయపడేవారు. అలా ఒక ఏడాది గడిచింది.

* * *

బాధని తొక్కిపట్టి చిన్నగా నవ్వుతూ వాళ్ళిద్దరి వేపూ చూశాను. "నాకు బాగా జ్ఞాపకం ఉంది, కృష్ణా! అసలు మరిచిపోతేనే గదా?" అన్నాను. అనునయంగా నా వీపు మీద చెయ్యి వేసి తట్టాడు చిన్నాన్న.

"ఆ అమ్మాయి పేరు రత్నకుమారి కదూ?"

నా మాటకి 'అవును' అన్నట్టు తల ఊపింది పిన్ని.

"ఇంతకీ ఏం జరిగింది?" అన్నాను.

"ఏముంది! ఆ అమ్మాయికి పెళ్ళి అయింది, నువ్వు పెళ్ళి చూపులకి వెళ్ళిన నాలుగు నెలలకే అనుకుంటాను. భర్త హైదరాబాదులో ఏదో ఫెర్టిలైజర్ ఫాక్టరీలో ఉద్యోగం చేస్తాడు. మొన్నీ మధ్యే డెలివరీకి వచ్చింది. మన హాస్పిటల్లోనే ఆడపిల్లని కన్నది. కాన్పు సరిగా కాలేదు. చాలా కష్టపడింది, పాపం. మీ పిన్నీ, వాళ్ళ సీనియర్ ఒకావిడా ఆ కేస్ అటెండయ్యారు" అన్నాడు చిన్నాన్న.

"మళ్ళీ ప్రెగ్నెన్సీ వస్తే ఆ అమ్మాయి బతకదు!" అంది పిన్ని.

ఎందుకో సరిగా చెప్పలేను గాని, అప్పుడే నా మస్తిష్కంలోకి ఓ పిచ్చి

> ప్రతి మనిషి తనను తాను ప్రేమించినంతగా ఇతరులు ఎవరినీ ప్రేమించడు. అదే మానవత.
>
> —టెరెన్స్

ఊహ వచ్చింది. గుండెలో బండలాంటి కసి చిక్కగా పేరుకుపోయింది. పశు ప్రవృత్తి రెండు క్షణాల పాటు నన్ను ఆ వేశంతో వణికిపోయేలా చేసింది. నన్ను కాదని తిరస్కరించిన ఆ అమ్మాయి మళ్ళీ గర్భవతి అయి, కాన్పు కష్టమై, ప్రాణాలు పోగొట్టుకున్న దృశ్యం నా మనోనేత్రం ముందు కదిలింది.

"లే లే" అన్నాడు చిన్నాన్న.

"పద రామూ, భోజనం చేసి ఏదైనా సినిమాకి పోదాం" అంది పిన్ని.

* * *

రెండవ బీరు బాటిల్ సగం ఖాళీ చేశాను. తలంతా గిర్రున తిరుగుతున్న ట్టనిపిస్తూంది. జారిపోతూన్న ధైర్యం చిక్కబట్టుకోవడానికి తాగానుగానీ, తాగిన ద్రవపదార్థం నిషా ఇవ్వలేదు. ధైర్యం అంతకన్నా అందించలేదు. ఆలోచననీ, బాధనీ మరింత ఎక్కువ చేస్తూంది. బేరర్‌ని పిలిచి మా ఫాక్టరీ టెలిఫోన్ నంబరిచ్చాను. ఫోన్ చేసి, 'రాజశేఖర్ వచ్చాడా?' అనడగమన్నాను. సమాధానం విని నాకు చెప్పమన్నాను. నే నిచ్చిన రూపాయి తీసుకుని వెళ్ళిపోయాడు. మిగతాసగం బీరూ గ్లాసులోకి వంపాను. చేతకాని పని కావటం వల్ల గ్లాసులో పడ్డ బీరు బుసబుస మంటూ ఒక్కసారి పొంగింది. నురగ రూపంలో పావుగ్లాసుడు బీరు టేబిలు మీద వలికిపోయింది. బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను. వాష్‌బేసిన్ దగ్గర మొహం కడుక్కునిరుమాలుతో తుడుచుకున్నాను. మళ్ళీ నా సీటు దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. ఇంకా బేరర్ రాడేం? వలికిపోగా మిగిలిన బీరుని పూర్తి చేశాను. మళ్ళీ జేబులోంచి టెలిగ్రాం తీశాను. ఒక్కొక్క అక్షరం స్పష్టంగా చూశాను. నాకు ఒక్కసారి చచ్చిపోవాలనిపించింది. ఈ ఉద్వేగాన్నీ, ఉద్రేకాన్నీ మరింక భరించలేను. ఈ నిప్పులకుంపటి మరింక మొయ్యలేను. క్షణక్షణం బుసలు కొడుతూ కాటేసే కాలనాగుని నే నిక నా జేబులో దాచుకోలేను. చెప్పెయ్యాలి. రాజుకి వెంటనే చెప్పి తీరాలి. అంతవరకూ ఈ అగ్నిగుండాన్ని ఏలాగోలా మొయ్యాలి. మళ్ళీ వాచీ చూసుకున్నాను. తొమ్మిదిన్నర అయింది. బేరర్ వచ్చాడు. 'ఇంకా రాలేదు. పన్నెండుకి రావచ్చు' అని సమాధానం. లార్జి పెగ్ విస్కీ తెమ్మన్నాను. ఇంకా రెండున్నరగంటలు. ఎలాగడపటం? సిగరెట్ వెలిగించాను. గట్టిగా రెండు దమ్ములు లాగాను. ఏదైనా చెయ్యాలి. ఏదో ఒకటి చేసితీరాలి. అంత దూరం నడిచే ఓపిక లేదు. ఉన్నా పోలీసుల ప్రశ్నలకి జవాబు చెప్పాలి. అసలే నగరంలో ఉద్రిక్తత ప్రబలంగా ఉంది. రాకపోకలు లేక ప్రజాజీవితమే స్తంభించిపోయింది. ఈ పరిస్థితిలో ఈ టెలిగ్రామ్. నాది కాని ఘోరవార్త. నేనే మోసే దురదృష్టం. ఊళ్ళోనే ఉండి కలుసుకోలేకపోయిన అసహాయత. విస్కీ వచ్చింది. పీలైనంత ఎక్కువ ఒక్క గుక్కలో తాగాను. 'రాజశేఖర్' అనబడే రాజు నా కళ్ళముందు మెదిలాడు. అందగాడు కా దతను. అనాకారి కాడు. ఆరోగ్యంగా ఉంటాడు. ఎప్పుడూ నవ్వుతాడు. ఆఫీసూ, ఇల్లూ— ఈ రెండే అతని ప్రపంచాలు. భార్య అన్నా, కూతురన్నా వల్లమాలిన అనురాగం. పైగా మరింక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. ఒక్కరైతే పాపగనక ఆ పాపమీదే పంచ ప్రాణాలు వాళ్ళిద్దరికీ. నన్ను తిరస్కరించిందని ఆ నాడు బాధపడ్డానే గానీ, అదంతా ఇప్పుడు మరిచిపోయాను. రత్నకుమారి ఎంత మంచిది! భర్తంటే ఎంత గౌరవం! అలాంటి భార్య ఉన్న ఏ మగాడు అదృష్టవంతుడు కాడు? ఛీ! రత్నకుమారి మీద నా కిప్పుడు కోపం ఏమీ లేదు. నన్ను తిరస్కరించి రాజుని పెళ్ళాడిందన్న అసూయా లేదు. వాళ్ళిద్దరూ వాళ్ళ కోసమే పుట్టారు. అవును, రోజా ఎంచక్కని పాప! వాళ్ళమీద ఈర్ష్యగానీ, ద్వేషం గానీ ఉండకూడదు. తప్పు. దేవు డనేవా డున్నాడో లేదో గాని, రాజు నా దృష్టిలో దేవుడితో సమానం. ఆ దేవుడికి ఈ విషాద వార్త ఎలా అందించడం?

కణతలు రుద్దుకున్నాను.

గ్లాసులోని విస్కీ మరికొంత తాగాను. మళ్ళీ సిగరెట్ వెలిగించాను. మత్తుగా కళ్ళు మూసుకుని వెనక్కి చేరబడ్డాను. కాలం గడిచిపోతూంది. క్షణాలు బరువుగా, తాపీగా దొర్లుతున్నాయి.

* * *

పదకొండయింది. ఈ పాటికి రాజు వచ్చి ఉంటాడేమో? ఫోన్ చేస్తే? అలా ఎన్ని సార్లు ముందుగా మేము ఫాక్టరీకి వెళ్ళలేదు? బేరర్ని పిలిచి మరోసారి ప్రయత్నించమన్నాను. గ్లాసులోని విస్కీ అంతా ఖాళీ చేసినా, మెదడు మొద్దుబారింది తప్ప, నిషా ఏమీ లేదు. ఎందుచేతో? ఒక గాలన్ విస్కీ తాగితే నన్ను నేను మరిచిపోతానేమో? బేరర్ వచ్చాడు. 'టెలిఫోన్ లైన్లు పాడయ్యాయి. పని చెయ్యడం లేదు.'

గోడకేసి తల బాదుకోవాలనిపించింది. ఇప్పు డెలా? టెలిఫోన్లు పలకవు. తెల్లారి తొమ్మిదింటికి గాని రాజు ఇంటికి రాడు.

బేరర్ని పిలిచి క్వార్టర్ బాటిల్ రమ్మూ, రెండు కోక్‌లూ మిక్స్ చేసి, ఓ సీసాలో పోసి తెమ్మన్నాను. మొత్తం అంతటికీ బిల్ పట్టుకు రమ్మన్నాను.

* * *

బిల్లిచ్చి బయట పడేటప్పటికి పదకొండున్నరైంది. టెలిఫోన్ చేశాను మళ్ళీ. ఏం లాభం? అవతల రింగవటం లేదు. లైన్లు పాడు చేశారు జనం. రైళ్ళు తగలెట్టిన జనం. బస్సులు కాల్చిన జనం. లాఠీదెబ్బలు తిన్న జనం. ఆందోళన చేస్తున్న జనం. ఎవరికి మాత్రం ఏం తెలుస్తుంది? ఒక్కగా నొక్క కూతుర్ని, అపరంజిబొమ్మని శాశ్వతంగా పోగొట్టుకున్నా, ఆ సంగతి తెలియక, ప్రమోషన్ వచ్చిన సందడిలో ఓ అభాగ్యుడు సిన్నియక్‌గా ఫాక్టరీలో పనిచేసుకుంటున్నాడని?

నిస్పృహగా రిసీవర్ని క్రేడిల్ మీద పడేశాను. సీసా చేత్తో పట్టుకుని బయటికి వచ్చాను. అంతటా చీకటి. ఆ చీకట్లో ఓ షాపు అరుగు మీద కూలబడ్డాను. చలికి వణుకుతూ, సిగరెట్లు తాగుతూ, రమ్ గొంతులో పోసుకుంటూ తెల్లవార్లూ అక్కడే కూర్చుని కునికిపాట్లు పడ్డాను.

కళ్ళు తెరిచి చూసేటప్పటికి ఎండ ఫెళ్ళుమంటూ కనిపించింది. తొమ్మిదిన్నరైంది. చేతిలోని సీసా వదిలేసి నిలబడ్డాను. బట్టలకి అంటిన ధూళినైనా దులిపే ఆసక్తి కూడా లేక కనిపించిన ఆటోరిక్షా ఎక్కాను. వాడు ఏది రూపాయి అడిగితే వాదించే ఓపిక లేక సరేనని చెయ్యి ఊపాను. అల్లంత దూరంలో కాలనీ కనిపించగానే గుండెలోని స్పందన హెచ్చింది.

* * *

తలుపు తీసి ఉంది. రాజు ఇంట్లోనే ఉన్నాడన్న మాట. గుమ్మంలో నిలబడి చూశాను. ప్రశాంతంగా ఉంది లోపల. బయట అంత ఎండ ఉన్నా, ఇంట్లో చిరుచీకటి ఉంది. ఆ చీకట్లోనే కుర్చీలో కూర్చున్న రాజు కనిపించాడు. ఈ రాజు కోసం నిన్నట్నుంచి ఎంత శ్రమపడ్డాను! కారణం ఏమైతేనేం? అమ్మయ్య, ఈ వార్త అతనికి చెప్పేస్తాను. విని ఏమవుతాడో! ఇంతటి ఘోరవార్త విని తట్టుకోగలడా? తడబడుతూ లోపలికి నడిచి అతనికి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాను. జేబులోంచి టెలిగ్రామ్ తీశాను. ఇవ్వడానికి చెయ్యి చాచాను. అతను అందుకోలేదు. విచారంగా 'ఏమిటి?' అన్నట్టు చూశాడు. తప్పదు. చెప్పక తప్పదు.

"మన రోజా కారు కింద పడి. . ."

అంటున్న నన్ను వారించాడు. అతని ముఖంలో మార్పు లేదు. అదే విషాదం.

"టెలిగ్రామ్ నిన్న నాలుగున్నరకి అందింది. అప్పటినించీ మీ కోసం ప్రయత్నం చేశాను ఈ విషయం చెపుదామని. బస్సు లేవు. టాక్సీల్లేవు. టెలిఫోన్ లైన్లు పాడయ్యాయి. ఈపాటికి రోజాని మట్టిలో. . ." అన్నాను మళ్ళీ నేనే దుఃఖాన్ని దిగమింగుకొంటూ.

"రాత్రి తొమ్మిదికే నా కీ సంగతి తెలిసింది. టెలిఫోన్స్ డిపార్ట్‌మెంట్‌లో మా ఫ్రెండొకడున్నాడు. వాడి కోసం వెళితే. . . వైజాగ్ నుంచి ఎవరో ఈ మెసేజ్ నా కిమ్మన్నారట. సెలవు పెట్టి రాత్రల్లా గాలిగూడా బస్‌డిపోలో ఉన్నాను. బస్సుల్లేవు. రైళ్ళు లేవు. ఎలా వెళ్ళడం విశాఖపట్నం? దారే లేదు. ఒక్క ఆకాశం మిగిలింది. ఈ వేళ వెళదామనుకుంటున్నాను. వెళ్ళినా ఏం ప్రయోజనం? రోజాని. . . మీరు చెప్పినట్టు ఈ పాటికి మట్టిలో కలిపేసి ఉంటారు. . ." అంతవరకూ మామూలుగా ఉన్న మనిషి ఒక్కసారి చేతులతో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

అతని దుఃఖోద్వేగాన్ని చూస్తూంటే ఓదార్చడానికికూడా నాకు ధైర్యం చాలలేదు. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతూ ఉంటే చూస్తూ కూర్చున్నాను. ★